www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 12 | ఏప్రిల్ | 2025 పేజీలు 8

## స్వామి వారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దంపతులు



2లో

# దారి మళ్లుతున్న సన్నబియ్యం






**-దత్తాత్రేయుడే ప్రధాన సూత్రధారి**
**-ద్విచక్ర వాహనాలపై ఆంధ్రాకు తరలింపు**
**-దత్తాత్రేయుడి కింద ఆ నలుగురు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం దారి మళ్ళుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతలపూడి మండలానికి చెందిన ఓ అక్రమ బియ్యం వ్యాపారి, సత్తుపల్లి మండలంలో నాలుగు నుండి ఆరుగురు వ్యక్తులను అనుచరులుగా నియమించుకుని సన్నబియ్యాన్ని దారి మళ్ళిస్తున్నాడు. గతంలో కేజీ 19 రూపాయలు చెల్లించిన దత్తాత్రేయుడు, సన్నబియ్యానికి రూ. 25 నుండి రూ.30 చెల్లిస్తుండటంతో అక్రమ వ్యాపారులు సన్న బియ్యాన్ని తెలంగాణ

మిగతా 2లో..

# గత పాలకులు చేయని అభివృద్ధిని చేసి చూపించాం..




**-ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/మణుగూరు:** గత పది సంవత్సరాలలో చేయని అభివృద్ధి మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 15 నెలల్లో ఆర్థిక పరిస్థితి సహకరించక పోయిన అభివృద్ధి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కడ తగ్గనీయకుండా అభివృద్ధితోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలను సంక్షేమ కార్యక్రమాలను ప్రతి పేదవాడికి అందే విధంగా ఇస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మా ఇందిరమ్మ హయాంలో చేసి చూపెడుతున్నామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి

మిగతా 2లో..

# మా భూములపై మాకు తెలియకుండానే రుణాలు



**-మాజీ సర్పంచ్ భర్త మోసం చేశాడంటూ గిరిజనుల ఆందోళన**
**-తహసీల్దార్‌కు వినతి**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మాజీ సర్పంచ్ భర్త తమ పేరుతో ఉన్న భూములను తాకట్టు పెట్టి సబ్సిడీ రుణాలు పొందాడని గిరిజనులు కేంద్ర సహకార బ్యాంక్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని కాచిరాజుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.267లో మాకు ఉన్న భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి సబ్సిడీ రుణాలు పొందాడని గిరిజన మహిళలు ఆరోపించారు. మా భూమితో బ్యాంకులను మోసం చేసి మా భూములను అక్రమంగా తన పేరు మీద రికార్డు చేయించుకున్నాడని కస్నాతండాకు చెందిన గిరిజనులు ఆరోపించారు. అక్రమంగా కేంద్ర సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న వ్యక్తిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఖమ్మం రూరల్ తహసీల్దార్‌కు భూ ఆక్రమణకు పాల్పడిన చావిడి రామారావుపై ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఈ భూ విషయం న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని గిరిజనుల వినతి పత్రం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆందోళన నిర్వహించిన వారిలో అజ్మీర ఝాన్సీ, మంగమ్మ, నల, భాస్కర్, సంధ్య, కోట్యా తదితరులున్నారు.

# నిరంతర శ్రమతో లక్ష్యాలను సాధించవచ్చు




**-యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి**
**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**-బొమ్మలో ఘనంగా జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నిరంతర శ్రమతో జీవితంలో మనం నిర్దేశించుకున్న ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చునని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం బొమ్మ విద్యా సంస్థల్లో నిర్వహించిన 12వ జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు తమ లక్ష్యంపై స్పష్టత అవసరమన్నారు. చిన్నతనం నుంచి ఇతరుల గైడెన్స్‌తో మనం ఈ స్థాయికి వచ్చామని ప్రస్తుతం మనకు ఏమి కావాలి, మనం ఏమి సాధించాలి అనే ప్రశ్న వేసుకుని ఆ దిశగా ప్రయాణం ప్రారంభించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, చిన్న చిన్న సాధనలకు సంతృప్తి చెందవద్దని శాస్త్రవేత్త అయితే ఇస్రోలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఐటి రంగంలో ఎదగాలనుకుంటే గొప్ప కంపెనీల సిఈవో స్థాయికి చేరుకోవాలని, ఐఏఎస్, ఐపిఎస్, ఉన్నతమైన స్పెషలిస్ట్ వైద్యులు, నలుగురికి ఉపయోగం కల్పించేలా పెద్ద పెద్ద పరిశ్రమల ఏర్పాటు వంటి లక్ష్యాలను పెట్టుకోవాలన్నారు. యవ్వనంలో మనకు సంపూర్ణ శక్తి ఉంటుందని దానిని సంపూర్ణంగా వినియోగించుకుని గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. శ్రమ లేకుండా మనకు ఏది రాదని, ధైర్యం, ధృఢసంకల్పంతో పాటు శ్రమ కలిస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. యువత కాంపౌండింగ్ కాన్సెప్ట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మనం చేసే పని

మిగతా 2లో..

# దారి మళ్లుతున్న సన్నబియ్యం

(మొదటిపేజీ తరువాయి)
సరిహద్దు ప్రాంతం గురుభట్లగూడెం గ్రామానికి తరలించి, డంప్ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు అక్రమ వ్యాపారులు ద్విచక్ర వాహనాలపై సుమారు 4 క్వింటాళ్ళ బియ్యాన్ని దాటిస్తూ కనిపించారు. ఎవరికి తరలిస్తున్నారు. ఎక్కడి తరలిస్తున్నారని ప్రశ్నిచగా జంకూ,బొంకు లేకుండా దత్తాత్రేయుడుకి తరలిస్తున్నామని చెప్పటం విశేషం. ప్రతి రోజు ఆరు గురు వ్యక్తులు ఉదయం, మద్యాహ్నం, సాయంత్రం ఒక్కో ద్విచక్ర వాహనంపై 2 క్వింటాళ్ళ చొప్పున్న సుమారు 12 క్వింటాళ్ళ లెక్కన రోజుకు 4 టన్నుల బియ్యాన్ని తరలిస్తున్నారంటే అక్రమ దందా ఏ రకంగా జరుగుతుందో ఇట్టే అర్దం చేసుకోవచ్చు. గతంలో దొడ్డ బియ్యం కావటంతో అక్రమ వ్యాపరం జోరుగా సాగిందని, సన్న బియ్యం పంపిణీతో అక్రమ వ్యాపారం ఆగిపోతుందనుకున్నారు. కాని సన్నబియ్యాన్ని సైతం అక్రమ వ్యాపారులు దారి మళ్ళించి భారీగానే సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేసి పేదల రాతలు మార్చాలని చూస్తుంటే, అక్రమ వ్యాపారులు అధిక ధరల ఆశ చూపి పేదల కడుపుకొడుతూ, వారి కడుపులు నింపుకుంటున్నారు. అక్రమ వ్యాపారుల ఆట కట్టించి పేదలకు అందుతున్న సన్న బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

# గత పాలకులు చేయని అభివృద్ధిని చేసి చూపించాం..

(మొదటిపేజీ తరువాయి)
శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు లోని పినపాక శాసన సభ్యులు క్యాంప్ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇందిరమ్మ ప్రభుత్వ సహాయం లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని, పేదవాళ్లే కావచ్చు ధనికులు కావచ్చు పది లక్షల రూపాయల వరకు పేదవాడికి జబ్బు చేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ ఆరోగ్య కార్డు ద్వారా ఉచితంగా వైద్య సదుపాయం కల్పిస్తున్నామని,500 రూపాయలకే ఉచిత గ్యాస్ పథకం, వాటితోపాటు రాజీవ్ యువ వికాస కార్యక్రమం ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నిరుద్యోగ యువకులకు 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు అందించే కార్యక్రమాన్ని ఈనెల 14 తేదీ అంబేద్కర్ జయంతి రోజు ప్రారంభిస్తున్నామని, ప్రతి పేద కుటుంబాలు తృప్తిగా సన్న బియ్యం తోటే భోజనాలు చేయాలని ఉగాది పండుగ రోజున ఈ బహుత్తర కార్యక్రమాన్ని ప్రారంభించామని, మా ప్రభుత్వము వస్తే రైతులను రాజుని చేస్తామని వాగ్దానం చేశామని, అన్న మాట ప్రకారం 2 లక్షల రూపాయల వరకు రైతన్నలకు రుణమాఫీ చేశామని 25 లక్షల 65 వేల మందికి 687 కోట్ల రూపాయలని రైతు రుణమాఫీ చేసి సన్న వడ్లు పండించే రైతన్నలకు ఎకరానికి 500 రూపాయలు బోనస్ ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు. త్వరలో పినపాక నియోజకవర్గానికి 3500 ఇండ్లు అందించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. గిరిజన ప్రాంతమైన ఈ ప్రాంతంలో ఎప్పటినుండో పరిష్కరించకుండా ఉన్న పులుసు బొంత ప్రాజెక్టును రాబోయే కొద్ది నెలల లోపే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోబోతున్నామని మంత్రి తెలిపారు. ఈ నెల 14 నాడు అంబేద్కర్ జయంతి రోజు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిల్పారామంలో సాయంత్రం ఐదు గంటలకి భూభారత చట్టాన్ని ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఏదైతే ఒక మైలురాయిగా పేదవాడికి కష్టంతో సంపాదించుకున్న భూములను భద్రత కల్పించే ఒక అద్భుతమైన భూభారతి చట్టం 2025 ని అన్ని జిల్లా కలెక్టర్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఈ సభకి ఆహ్వానించి, రాష్ట్రంలోనీ మారుమూల ప్రాంతంలో ఉండే భూములను ఆసాములకు ద్వారా మనస్ఫూర్తిగా ఈ వేదిక ద్వారా ముఖ్యమంత్రి చేతులు మీదుగా ప్రారంభిస్తున్నామని ఆయన అన్నారు. ప్రభుత్వంపై ఎంతమంది, ఎన్ని శక్తులు, కుట్రలు కుతంత్రాలు పన్నిన ప్రజల దీవెనలు ఉన్నంతకాలం ఈ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంధకార సమాజానికి వెలుగుదారి జ్యోతిరావు పూలే

**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**
**-సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతి**



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** సమాజంలో కొనసాగుతున్న వివక్షతకు, అణచివేతలకు గురవుతూ అంధకారంలో మగ్గుతున్న పీడిత కులాలకు, మహిళలకు వెలుగుదారి చూపిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావ్ పూలే అని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. సాంఘిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావ్ పూలే 199వ జయంతిని శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నందు ఘనంగా నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా సాబీర్ పాషా మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో అక్షరాస్యత కేవలం 11 శాతమేనని, సమాజంలో 89శాతం మందిని చదువుకు దూరం పెట్టిన పరిస్థితిలో ప్రధానంగా దళిత, బహుజన, మహిళలకు జ్యోతిరావు పూలే వారిలో జ్ఞాన కాంతులు వెలిగించారని కొనియాడారు. కులం పేరిట, ధర్మం పేరిట ప్రజలను అజ్ఞానంలో ఉంచేందుకు చేసిన కుట్రలను తిప్పి కొడుతూ ప్రజలను చైతన్యవంతం చేసేందుకు పూలే తన జీవితాన్నే అంకితం చేశారని అన్నారు. దళిత, బహుజన, స్త్రీల చదువుకోసం 1848లోనే తన సహచరి సావిత్రి బాయ్ పూలే, ఫాతిమా షేక్ సహకారంతో భారత దేశంలో తొలి పాఠశాలను స్థాపించాడని, గ్రామాల్లో ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాడని, బాల్యవివాహాల రద్దు, వితంతు స్త్రీల పునర్ వివాహం కోసం కృషి చేసి వారికి మెరుగైన జీవితం అందించారని కొనియాడారు. స్వేచ్చా, సమానత్వం, సంక్షేమం, అందరూ ఆనందంగా బ్రతకాలన్న లక్ష్యల్ని తన జీవితంలో భాగం చేసుకొని జీవితాన్ని సార్ధకత చేసుకున్న పూలే నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశించిన లక్షలను నెరవేర్చేందుకు కమ్యూనిస్టు కార్యకర్తలు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, కె రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, నూనావత్ గోవిందు, బత్తుల సురేష్, కత్తెర్ల రాములు, అజీజ్, కొచ్చెర్ల జోసెఫ్, కొచ్చెర్ల రాకేష్, సోమయ్య, బాజోజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావుపూలే భావితరాలకు ఆదర్శం : అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాచలం :** జ్యోతిరావుపూలే జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం అని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ఈ సందర్భంగా ఐడిఐసి లో జరిగిన పూలే జయంతి వేడుకలకు హాజరై న అదనపు కలెక్టర్ పూలే చిత్రపటానికి పూలా మలాలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అభివృద్ధి చెందేందుకు విద్యావంతులు కావాలని భావించి తన భార్య సావిత్రబా పూలే పాఠశాలను ప్రారంభించారని చెప్పారు. మహిళా విద్యకై వారు ఎంతో పరితపించారని, ఆయన కార్య దీక్ష మహోన్నతం అన్నారు. దీనిని అంతా స్పూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాస్, సత్యనారాయణ, జయమ్మ, రాంబాబు, సుధాకర్ రామ తులసి, సాంబయ్య, మీనాక్షి, రాజుగౌడ్, వెంకటాచారి, శంకరయ్య, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

**భద్రాచలంలో...**
భారతదేశ సామాజిక విప్లవ ప్రధాన జ్యోతిరావు పూలే అని డా భాను ప్రసాద్ అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈసందర్భంగా భానుతోపాటు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, మేకల లత మాట్లాడుతూ జ్యోతిరావు పూలే స్త్రీ విద్యకోసం పాటుపడ్డారన్నారు. సావిత్రబా పూలే బాలికా విద్యను ప్రవేశపెట్టి ఎందరినో మేల్కొలిపారని చెప్పారు. ఇదే స్పూర్తితో అంతా బాలికలను పెద్ద ఎత్తున చదివించి భావితర వికాసానికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్, ప్రవీణ్, వెంకటరెడ్డి, అలీ, కుమారి, నాగమణి, కృష్ణవేణి, రాము, ఈశ్వర్, అర్జున్ పాల్గొన్నారు.

# నిరంతర శ్రమతో లక్ష్యాలను సాధించవచ్చు



(మొదటిపేజీ తరువాయి)
శాశ్వతంగా ఉండిపోతుందని అదే మనకు గుర్తింపు తీసుకువస్తుందన్నారు. మనం గొప్ప స్థాయికి చేరుకున్నాక మరో పది మందికి సాయం చేయాలని మన గ్రామాలు, ఊర్లను అభివృద్ధి చేసేందుకు తోడ్పాటునందించాలన్నారు. ఈ సందర్భంగా ఇస్రో మాజీ సీనియర్ శాస్త్రవేత్త డా॥ గంజి వెంకటనారాయణను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మ విద్యా సంస్థల ఛైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ ఛైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, సైకాలజిస్టు డా॥ అశోక్ పరికిపండ్ల, ప్రిన్సిపాళ్లు భిక్షం, విజయ్‌భాస్కర్, రంజిత్, అకాడమిక్ డీన్ కిరణ్, జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దంపతులు

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్దిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ దపంతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ సిబ్బంది, అర్చకులు దేవాలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్ధ ప్రసాదాలు అందించారు. ముందుగా మధిర మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చావా రామకృష్ణ, ఎర్రుపాలెం సొసైటీ అధ్యక్షులు ముల్పూరి శ్రీనివాసరావు, వాసిరెడ్డి శికుమారి వారికి స్వాగతం పలికారు. అనంతరం ఎన్వి రమణ మాట్లాడుతూ ఆలయానికి వస్తే ఎంతో ప్రశాంత వాతావరణం ఉండేలా ఆలయ అధికారులు ఆలయ ప్రాంతంలో గ్రినరీ ఏర్పాటు చేస్తే భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాశ్‌శర్మ, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


# ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మంజూరు పట్ల హర్షం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మైనింగ్ ను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం 300 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు మంజూరు చేయడంలో పట్టు వదలని విక్రమార్కుడిలాగా విశేష కృషి చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు కూంననేని సాంబశివరావు చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మైనింగ్ విద్యార్థులతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫహీమ్ దాదా మాట్లాడుతూ. దేశంలో మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాకు మంజూరు కావడం హర్షనీయమనారు. రాష్ట్ర విద్యార్థులు ఇన్నాళ్లు ఎర్త్ సైన్సెస్ కోర్సు చదవాలంటే సెంట్రల్ యూనివర్సిటీలకు వెళ్లాల్సి వచ్చేదని కొత్తగూడెం లోనే ఈ కోర్సులు అందుబాటులోకి రావడంతో విద్యార్థుల ఇబ్బందులు తీరనున్నాయన్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాష్ట్రంలోనే మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాకు మంజూరు కావడంతో అత్యున్నత ప్రమాణాలతో వేలాది మంది విద్య ఉపాధి అవకాశాలు లభించనున్నాయనీతెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు విద్యార్థులకు, విద్య అందుబాటులో ఉండాలని కొత్తగూడెం నియోజకవర్గంలోని సుజాతనగర్ లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేపించారని నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని ఆయన అన్నారు. ఇదేవిధంగా ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం మంజూరు చేయుటకు కృషిచేసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కు, అఖిల ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినయ్, సంజయ్, పవన్ సింగ్, రణధీర్, శివ పాల్గొన్నారు.

# గిరిజన మహిళ ఆశా వర్కర్‌పై లైంగిక, భౌతిక దాడి

**- ఏఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితురాలు**
**- నిందితుల వల్ల ప్రాణహాని ఉందంటూ మీడియాను ఆశ్రయించిన మహిళ**



**ప్రజాపక్షం/భద్రాచలం :** చర్ల మండలంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. ఆ మండల పరిధిలోని సత్యనారాయణపురం ప్రాథమికఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గిరిజన మహిళపై చర్ల మండల కేంద్రంలోని మెడికల్ షాపు నిర్వాహకుడు రమేష్ లైంగిక వేదిపులతో పాటు భౌతిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. వేదింపులు తాళలేక రమేష్ భార్యతో పాటు అత్తకు ఫిర్యాదు చేయడంతో కోపోద్రోక్తుడైన రమేష్ తన వారికి ఎందుకు చెప్పావంటూ ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న ఆశా వర్కర్‌పై దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడ్డాడు. అక్కడి పోలీసులు ఆమె ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతోభద్రాచలంలో ఏఎస్పి ఫిర్యాదు చేసింది. నింధితుని వల్ల ప్రాణహాని ఉన్నట్లు బాధిత మహిళ మీడియాకు వెల్లడించింది.

# ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

## కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండలంలోని కాచిరాజుగూడెంలో ది ఆంధ్ర బ్యాంక్ కర్షక సేవా సహకారం సంఘం లిమిటెడ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహాకర సంవత్సరం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసన సభలో ఆయన మాట్లాడారు... ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో దోహదపడతాయని, సంఘం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలన్నారు. అనంతరం శిబిరంలో అందిస్తున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య పరీక్షలు చేపించుకున్న వారికి ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో కంటి, ఇతర శాస్త్ర చికిత్సలు ఉచితంగా చేయాలని సూచించారు. ఈ శిబిరంలో రైతులు, ప్రజలు కలిపి మొత్తం 169మంది పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ బిరెడ్డి నాగచంద్రారెడ్డి, ఖమ్మం జిల్లా సహకార అధికారి జి.గంగాధర్, డిఎంఅండ్‌హెచ్‌ఓ కళావతిభాయ్, అసిస్టెంట్ రిజిస్టర్ ఉషశ్రీ, తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపిడీఓ కుమార్, ఏఓ ఉమా నాగేష్, పిహెచ్ వైద్యులు బాలకృష్ణ, గ్రామ కార్యదర్శి సుజాత, సంఘం మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ సాకేత్‌కుమార్, సీఈఓ బుర్ర అశోక్, డైరెక్టర్లు, సిబ్బంది, జాబిశెట్టి హాస్పిటల్, ప్రవీణ్ ఈఎన్‌టి హాస్పిటల్, గురుదత్త ఐ హాస్పిటల్, రితన్య హాస్పిటల్, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

## -డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, నిధుల (ఫండ్స్) ఉపయోగంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్ల పనితీరు మెరుగుపడాలన్నారు. మందుల వివరాలన్ని ఈ ఔషధిలో ప్రతి రోజు నమోదు చేయాలని, పిహెచ్‌సిలో ఉన్న మందుల వివరాలు డిస్‌ప్లే బోర్డు మీద అందరికీ అర్థమయ్యేవిధంగా రాసి పెట్టాలన్నారు. డ్రగ్స్ స్టాక్ రిజిస్టర్ సరిగ్గా మెయింటెన్ చేయాలన్నారు. ఎక్స్పైరీ మందుల వివరాలు సరిచూసి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈహెచ్ఐ, ఎంఎస్‌లో అన్ని అప్‌డేట్ చేయాలన్నారు. కొత్తగా వచ్చిన ఎంఎల్‌హెచ్‌పిలకు, డిఈవోలకు హెచ్ఐఎంఎస్, ఎన్‌సిహెచ్ కిట్స్, ఎఫ్‌పిఎల్, ఎంఐఎస్, ఆరోగ్య మహిళ, అమ్మ కోసం, పిఎంఎస్ఎం, ఎ విన్, ఈ విన్, యు విన్, ఈ ఔషధి, ఈ సంజీవని, ఐఎంఐ, ఎన్‌సిడి, టెలిమానెస్, వయో వృద్ధుల ఆరోగ్య రక్షణ, ఐడిఎస్‌పి, ఎన్‌విల్‌ఈపిటి హబ్ మొదలైన జాతీయ ఆరోగ్య మిషన్ పోర్టల్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హచ్‌వో డాక్టర్ సైదులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రామారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మోతియా, డెమో సుబ్రహ్మణ్యం, ఆఫీస్ సూపరింటెండెంట్లు రాజేందర్, ఉమాదేవి, రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, ఎన్‌హెచ్‌ఎం (డిపివో) దుర్గ, జైసి సీభా, నర్సయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# బజాజ్ గో గో ఎలక్ట్రిక్ ఆటో విడుదల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్యాసింజర్ ఆటో రంగంలో దిగ్గజ సంస్థయైన బజాజ్ ఆటో ఆధ్వర్యంలో రూపొందించిన బజాజ్ గో గో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ ఆటోను ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేశారు. శుక్రవారం వెంకటరమణ ఆటో మొబైల్స్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన ఎలక్ట్రిక్ ఆటోను విడుదల చేశారు. ఈ సందర్భంగా బజాజ్ కంపెనీ ప్రతినిధులు ఆర్ఎం బాబ్జీ మాట్లాడుతూ బజాజ్ అంటే ఒక నమ్మకం, భరోసా అని తెలిపారు. బజాజ్ కంపెనీని ఇంతలా ఆదరిస్తున్న కస్టమర్ల కొరకు అతి తక్కువ మెయింటినెన్స్‌తో సుమారు 250 కిలో మీటర్ల మైలేజీతో కొత్త బజాజ్ గో గో ఎలక్ట్రిక్ ఆటోను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. బజాజ్ ఇక ముందు గో గోగా మారిపోతుందన్నారు. ఈ సందర్భంగా వివిసి గ్రూప్స్ అధినేత వంకాయల పాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలో బజాజ్ ఆటోను ఇంతలా ఆదరిస్తున్న కస్టమర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచమంతా మెచ్చిన బజాజ్ ప్యాసింజర్ ఆటో ఇప్పుడు ఎలక్ట్రిక్ విభాగంలో బజాజ్ గో గోగా రావడం అభినందనీయమన్నారు. ఈ బజాజ్ గో గో పవర్‌ఫుల్ 12కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో ఒక్కసారి చార్జ్ చేస్తే సుమారు 250 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందన్నారు. రెండు మోడల్స్‌తో గో గో ఆటో లభ్యమవుతుందన్నారు. ఆకర్షణీయమైన డిజైన్‌తో పూర్తి మెటల్ బాడీ కలిగి రెండు స్పీడ్ ఆటోమెటిక్ ట్రాన్స్ మిషన్‌తో, ఆటో డెంజర్, యాంటీ రోల్ డిటెక్టివ్, ఎల్ఈడి లైట్స్‌తో లభ్యమవుతుందన్నారు. బజాజ్ గో గో ఈవి రెండు వెరియంట్లలో ఎక్స్ షోరూం ధర రూ. 3,26,798 నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రారంభ సందర్భంగా పది మంది కస్టమర్లకు ఒకేసారి డెలివరి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల అభిప్రాయం మేరకు మాచే నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన డబుల్ స్టేర్ షోరూం నందు క్విక్ సర్వీస్ క్యాంపు ఉందని దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జజాజ్ కంపెనీ ప్రతినిధులు, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ పక్వాడ వారోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామం పంచాయతీలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా... 7గురు మహిళలకు శ్రీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు తీసుకోవాల్సిన, జాగ్రత్తలు, పోషక ఆహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ సర్పంచ్ సిద్ధినేని కర్ణ కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్ కె. నీరజ, ఏఎన్ఎమ్‌బి లక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ జయమ్మ, బేగం, మౌనిక, ఆశవర్కర్లు బి. ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/ తల్లాడ :** అఖిల భారత రైతు సంఘం 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు పారసాని సత్యనారాయణ, ఐలూరి అప్పిరెడ్డి, మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, సేలం సత్యనారాయణరెడ్డి జెండాలను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1936ఏప్రిల్ 11న ఆనాడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఏర్పడిన రైతు సంఘం అనాటి నుండి ఈనాటి వరకు పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. పోరాటాలతో సాధించుకున్న రైతు హక్కు చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కార్పొరేటర్లకు అనకూల నల్ల చట్టాలను అమలు చేసే ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. రైతులందరూ ఐక్యంగా పోరాటాలు చేయటం ద్వారానే వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పారసాని వెంకటయ్య, కొమ్మినేని రాంబాబు, సుంకర కృష్ణయ్య, పారసాని రాజేశ్వరరావు, మాసవరపు రాఘవయ్య, దొడ్డపనేని నాగేశ్వరరావు, కట్టా దరగయ్య, ఐలూరి రామిరెడ్డి, సేలం సిద్దారెడ్డి, పోతురాజు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకుచ్చే ధాన్యాన్ని కొర్రీలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తల్లాడ మండలంలోని వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వరి ధాన్యం ఎక్కడకక్కడే కుప్పలు రాసులుగా జిల్లా వ్యాప్తంగా కనపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం చెప్పినట్లుగా కొనుగోలు ఏ మాత్రం చేయటం లేదని, గత 15రోజులు రైతులు ఎండ వేడికి కొట్టుమిట్టాడుతూ అకాల వర్షాల భయంతో తమ ధాన్యంతో పడిగాపులు కాస్తున్నారని అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా రైతుల ధాన్యం కొనే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, జిల్లా అధ్యక్షులు చావా కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, మందడపు సుబ్బారావు, బిజెపి మండల అధ్యక్షులు చల్లా నాగులు, ఆపది వెంకటనారాయణ, తేజావత్ బాలాజినాయక్, సమ్మెట రాంబాబు, రాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు మాదిగ అధ్యక్షతన శుక్రవారం జ్యోతి రావుపూలే 199 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వర రావు మాదిగ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల వివక్షతపై, వెనకబడిన వర్గాల దళిత పేద వర్గాల హక్కులు, విద్యా వ్యాప్తి కోసం సంఘ సంస్కర్తగా పోరాడిన మహనీయులు జ్యోతిరావు పూలే అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన కలలు కన్న పేద వర్గాల రాజ్యస్థాపనకు నేటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ అధ్యక్షులు ఎక్కిరాల నాగరాజు, గౌరవాధ్యక్షులు అద్దంకి వెంకటేశ్వరరావు మాదిగ, రవి, శ్రీకాంత్, లక్ష్మ ణ్, వెంకటేశ్వరరావు, కృష్ణారావు, జయరావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



**ప్రజాపక్షం/బోనకల్:** పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె సుజాత అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ 1వ సెంటర్ పోషణపక్షం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సెంటర్‌లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందే పౌష్టికాహరమైన బెల్లం పట్టీ, రాగులతో తయారు చేయించి గర్భిణులకు, బాలింతలకు చూపించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ..ఏ ఆహరమైతే మనము తీసుకుంటే మన ఆరోగ్యము పెంపొందించి, అనారోగ్య పాలవుకుండా శక్తివంతంగా ఉంచి జీవనపరిమాణము మెరుగవుతుందో, అటువంటి ఆహరము ప్రతి ఒక్కరూ ప్రతి రోజు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీలక్ష్మి, నసీనాభేగం, అంగన్‌వాడీ టీచర్ కొంగర బేబి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు



ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు సబ్‌డివిజనల్ పోలీసు అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబాలకు మాక్స్‌విజన్ ఖమ్మం వైద్యులు శరత్, నరేందర్‌లు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. స్థానిక అయితాఫంక్షన్‌హాల్‌లో ప్రత్యేకంగా పోలీసు సిబ్బందికి, కుటుంబాలు 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, కంటికి సంబంధించిన ప్రథమచికిత్సలు నిర్వహించామని, ఎక్కువ సమస్యలు ఉన్న వారిని ఖమ్మంలోని శరత్ మాక్స్ విజన్ వైద్యుల ఆధ్వర్యంలో శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, ఇల్లందు, సీఐలు బత్తుల సత్యనారాయణ, సురేశ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కవిత సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం, నేలకొండపల్లి అంగన్వాడీ కేంద్రాలలో క్రవారం పోషణ పక్షం కార్యక్రమం ను నిర్వహించారు. గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రసన్నా కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారం ను తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన వంటలను తినాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పి.నాగమణి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచాలని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా కోరారు. కుల, ఆదాయ, ధృవీకరణ పత్రాలు కార్యాలయంలో సకాలంలో దరఖాస్తు చేసుకున్న సాంకేతిక లోపాలతో సకాలంలో రాలేదని, గడువు ఈనెల 14వ తేదీ తో ముగించటంతో దరఖాస్తుదారులు నష్టపోయే అవకాశం ఉన్నందువలన రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచాలని డిమాండ్ చేశారు. దీనికి తోడు ప్రభుత్వ సెలవులు ఉండటం వల్ల దరఖాస్తుదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, నెట్ సెంటర్ కు వెళ్లి ఆన్‌లైన్ చేస్తే సాంకేతిక లోపాలతో పనిచేయటం లేదని రాష్ట్ర ప్రభుత్వం గడువును పెంచాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో యువతకు కార్పొరేషన్ ద్వారా ఉపాధి పొందేందుకు దరఖాస్తు చేసుకుంటే నిజమైన లబ్ధిదారులకు రాకుండా నష్టపోయారని గత ప్రభుత్వం లాగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో రాజకీయ జోక్యం లేకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేకి ఘన నివాళి



ప్రజాపక్షం/జూలూరుపాడు: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడి, సామాజిక అసమానతలను తొలగించిన, గొప్ప భారతీయ ఆలోచనపరుడు, రచయిత, తత్వవేత్త, సామాజిక కార్యకర్త, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా దళిత, బహుజన, బిసి నాయకులు వారిని స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు మాట్లాడుతూ దేవుడు ఒక్కడే, ఆయనే అందరిని సృష్టించాడు, స్త్రీ అయినా పురుషుడైనా అందరూ స్వేచ్ఛగా పుట్టారని, అన్ని హక్కుల్ని అందరూ సమానంగా అనుభవించాలి పోరాడిన గొప్ప మహనీయుడు జ్యోతిబాపూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొండపాటి శ్రీనివాసరావు (వాసు), ఎద్దులపురం గోపాలరావు, నర్వనేని పుల్లారావు, లచ్చు నాయక్, మోదుగు రామకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, రామిశెట్టి నాగేశ్వరరావు, ముత్తినేని గోపి, షఫీ, మిరియాల కిరణ్ కుమార్, దాసరి నాగయ్య, పురస్తాపురపు శ్రీను, గార్లపాటి నరసింహారావు, చాకలి ఎస్సీ సాధన సమితి జనరల్ సెక్రటరీ ముదిగొండ వెంకటాపయ్య, కృష్ణ, మాడుగుల నాగరాజు, మాధవరావు, గోపి, వెంకటేష్, మల్కం బద్రం, పత్తిపాటి మోహన్, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వరి విత్తన సాగు ప్రదర్శన పరిశీలన





ప్రజాపక్షం/వైరా: వైరా మండలం అష్ణగుర్తిలో జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా అందజేసిన వరి కేయన్‌ఎం1638 రకం విత్తనం యొక్క క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి (కెయన్‌ఎం 1638) సాగు చేసిన రైతులకు ఈ రకం యొక్క సాస మెళకువలను, వారి అనుభవాలను రైతులు తెలిపారు. కెఎన్ఎం 1638 అనేది సన్నరకం విత్తనం, స్వల్పకాలిక రకం,(120 రోజులు), అగ్గి తెగులు, ఉల్లికోడును సమర్ధవంతంగా తట్టుకుంటుంది. దోమపోటును కూడా కొంతవరకు తట్టుకుంటుంది. ఈ రకం సాగు చేసిన రైతులు వారికి ఈ రకంలో పురుగు గాని, తెగులు గాని, ఆశించలేదని పంట మంచి ఎత్తుతో అధిక దుబ్బలతో కుంకులు బాగా ఏర్పడ్డాయని తెలియజేశారు. వారి ఈ పంటలో 30–35 బస్తాల దిగుబడి ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య, ఏడిఏ టెక్నికల్ వాసవిరాణి, ఏడిఏ వైరా కరుణశ్రీ, ఏవో టెక్నికల్ ప్రత్యూషా, పవన్, మండల వ్యవసాయ అధికారి మయాన మంజుఖాన్, రైతులు వెంపటి నాగేశ్వరరావు, శ్రీరామనేని వెంకటేశ్వరరావు, ఇటుకల మురళి, కొణిదెన కోటేశ్వరరావు, ఏఈవోలు పొరపాటి వాసంతి, సైదులు, వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల అనుభవాలు

**వెంపటి నాగేశ్వరరావు: అష్ణగుర్తి**

15 ఎకరాల్లో సాగు చేయడం జరిగింది. ఈ రకంలో మాకు ఎటువంటి తెగులు గాని పురుగు గాని ఆశించలేదు. డిసెంబర్15లోగా మేము ఈ విత్తనం చల్లడం జరిగింది. పైరు 50 రోజుల దశలో డిఎస్ఎస్‌ని కూడా చల్లడం జరిగింది. పంటలో మేము ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు వస్తాయని ఆశిస్తున్నాము.

**నర్వనేని గోపాలరావు: రైతు ముసలిమడుగు**

5 ఎకరాల్లో ఈ రకం వరి సాగు చేయడం జరిగింది. మంచి దిగుబడినిచ్చే విధంగా పంట చేతికి వచ్చింది. వరికి రోగాలు కూడా తక్కువగా వచ్చాయి. ఏపుగా దుబ్బలు కట్టింది. ఈ రకం సాగు చేయడం రైతు లాభదాయకం.

# వంటగ్యాస్ ధర పెంపు దుర్మార్గం : సారయ్య



ప్రజాపక్షం/ఇల్లందు: వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్రప్రభుత్వం పెంచడం దుర్మార్గమని, పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని ఎఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం పట్టణం లోని పాతబస్టాండ్ సెంటర్‌లో గ్యాసుబండను వీపున మోస్తూ నూతనంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50లు పెంచి పేద, మధ్య తరగతి, సామాన్య పెనుభారం వేసిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గించినప్పటికీ భాజపా ప్రభుత్వం వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య,పేద,మధ్యతరగతి ప్రజలపై భారం మోపడంపై మండిపడ్డారు. మోధీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని, మోధీ పదకొండేళ్ల పాలనలో వంటగ్యాసు ధరలు అనేకమార్లు పెంచుతూ మహిళలను మళ్లీ కట్టెలపొయ్యివైపు మళ్లించేలా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శి ఉడత ఐలయ్య, మాజీ వైస్ ఛైర్మన్ బాస శ్రీనివాస్, మాజీ కౌన్సిలరర్ కుమ్మరి రవిందర్, బొప్పిశెట్టి సత్యనారాయణ, తాండ్ర లక్ష్మి నారాయణ, మంచాల వెంకటేశ్వర్లు, కె.నగేశ్, బొల్లి కొమరయ్య, బొల్లి కొమరయ్య, సాంబమూర్తి, రాందాస్, ఎస్.కె.వలీ, నెల్లి కొమరయ్య, యాదగిరి, సుశీల, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



ప్రజాపక్షం/మణుగూరు: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం మణుగూరు ఏరియా బౌద్ధ అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బౌద్ధ అభిమాని, సామాజిక కార్యకర్త ఆంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలోనే లేదా ఈ భూమి మీద మొట్టమొదటి సామాజిక విప్లవకారుడు బుద్ధుడు అయితే ఆధునిక భారతదేశ చరిత్రలోనే మొట్ట మొదటి సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. ఈ ఆధునిక సమాజంలో పీడిత, వెనుకబడిన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన చిరస్మరణీయుడు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పట్ల వివక్ష, అంటరానితనం, సాంఘిక దురాచారాలకు కుల వివక్షకు వ్యతిరేకంగా 150 సంవత్సరాల క్రితమే పోరాడి అనేక విజయాలు సాధించిన జ్యోతిబా పూలే దేశంలోని పీడిత వర్గాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ప్రతి ఒక్కరు మహనీయుల అడుగుజాడల్లో వారి ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకై పాటుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియా బౌద్ధ అభిమానులు కే గురుమూర్తి, జి నాగేశ్వరరావు, వి శంకర్, కే నాగేశ్వరరావు, యు.శివరామకృష్ణ, ఎం. సాంబయ్య, కే శ్రీను, వై శంకర్, ఎం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ సబ్ రిజిస్ట్రార్ మాకొద్దు

**మంత్రి పొంగులేటికి ఫిర్యాదు చేసిన స్థానికులు**

ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తరచూ మద్యం సేవించి విధులకు హాజరవుతూ, కార్యాలయంకు వచ్చే ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ మాకొద్దు అంటూ పలువురు స్థానికులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేసి, వినతి పత్రం అందించారు. శుక్రవారం బూర్గంపాడు మండలంలో పర్యటించిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసిన స్థానికులు తమ గోడును మంత్రికి వెళ్లబుచ్చుకున్నారు. ఐదు మండలాలకు సేవలు అందించవలసిన బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన సీనియర్ అసిస్టెంట్, ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ తరచు మద్యం సేవించి కార్యాలయానికి హాజరవుతున్నారని స్థానికులు మంత్రికి తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద లేకుండా మాట్లాడుతూ, అకారణంగా గొడవలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సర్టిఫికెట్స్ కోసం వచ్చే ప్రజలను లంచాలు అభ్యర్థిస్తూ, ఇవ్వకపోతే కాలయాపన చేస్తూ నానా ఇబ్బందులు పెడుతున్నారని, సదరు సబ్ రిజిస్ట్రార్ గతములో పని చేసిన చోట మూడు సార్లు సస్పెండు అయి ఉన్నాడని మంత్రికి తెలిపారు. అయినా తీరు మార్చుకోకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకుని, వేరే సబ్ రిజిస్ట్రార్‌ను బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నియమించి మండలంలోని ప్రజలకు న్యాయము చేయాలని స్థానిక ప్రజలు మంత్రిని కోరి, వినతి పత్రం అందించారు.

# రోడ్డంతా గుంతలమయం..!

-భారీగా పెరిగిన వాహనాల రద్దీ
-వైరా రింగ్ రోడ్డు వద్ద పెద్ద పెద్ద గుంతలు
-ప్రమాదకరంగా మారిన ప్రయాణం
-మరమ్మతులు చేయించాలని వేడుకోలు







ప్రజాపక్షం/వైరా : వైరాలో రింగ్ రోడ్డు వద్ద మదిరరోడ్డు వైపు పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ గుంటలతో ఎప్పుడు ఏ ప్రమాదం ఏరూపంలో జరుగుతుందోనని వాహనదారులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రశాంతంగా ఇంటికి పోతామా ప్రమాదానికి గురవుతామా అని భయపడుతున్నారు. ఇది వైరా రింగ్ రోడ్డు వద్ద పరిస్థితి. నిత్యం రోడ్డుపై తిరిగే అధికారులకు ఈ గంటలు కనిపించడంలేదా అని ప్రజలంటున్నారు. గుంటల వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పలు మార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రజల ప్రాణాలకు రక్షణలేకుండా పోతోంది. ఎంతమంది ప్రమాదాల బారిన పడితే మరమ్మత్తులు చేస్తారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు ఇచ్చేది దేనికి. ప్రజాసంక్షేమం ప్రజాసమస్యల పరిష్కారం కోసంకాదా? గత కొన్ని రోజులుగా ఈ గుంటలవలన ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, ప్రజలు ఎంతో ఇబ్బందిపడుతున్నారు. జిల్లా అధికారులు ఇప్పటికైనా జోక్యంచేసుకొని వైరా రింగ్‌రోడ్డు వద్ద గుంటలకు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎమ్మెల్యే సార్.. జర రోడ్డు మరమ్మతులు చేయించండి....**

వైరాలోని రింగ్‌రోడ్డు వద్ద ఏర్పడిన గుంటలను వైరా శాసనసభ్యులు మాళోత్ రాందాస్‌నాయక్ ప్రత్యేక శ్రద్ధ చూపి అధికారులతో మాట్లాడి మరమ్మత్తులు చేయించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా ఈ గుంటలను అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకొని గుంటలకు మరమ్మత్తులు చేయించి ప్రజలకు రక్షణ కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే



ప్రజాపక్షం/బోనకల్: స్వాతంత్రం రాకముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మజ్యోతిరావు పూలే అని వారిని స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయాలను సాధనకు వారి అడుగుజాడల్లో నడవాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం 1952లో వచ్చిందని, అంతకు ముందే నాగరికత లేని రోజుల్లో మహాత్మ జ్యోతిరావు పూలే తన జీవితమంతా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్య నేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారని అన్నారు. ఆనాడు స్త్రీలకు స్వేచ్ఛ ఉండేది కాదని, తరతరాలుగా అణచివేతకు గురయ్యారన్నారు. చదువు ద్వారానే అభివృద్ధి చెందాలనే మహోన్నత ఆశయంతో స్త్రీలు చదువుకుంటేనే పురుషులతో సమానంగా ఎదగగలరని ఆ రోజుల్లో తన సతీమణి సావిత్రిబాబు ద్వారా బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత పూలేదేనని అన్నారు. సమాజంలో అందరూ సమానంగా ఉండాలని ఆయన ఎంతగానో కృషి చేసిన ఘనత ఆయనేదనని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, ఆర్ఐలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలి





ప్రజాపక్షం/కారేపల్లి: ఈనెల 27న హన్మకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే బిఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ బహిరంగ సభకు సింగరేణి మండలం నుండి పార్టీ కార్యకర్తలు, నాయకులు, పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని మాజీ శాసన సభ్యులు, ఆ పార్టీ వైరా నియోజకవర్గ ఇన్చార్జి బానోత్ మదన్‌లాల్ బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ వ్యవస్థాపకులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుల ఆదేశాలతో బహిరంగ సభ సందర్భంగా శుక్రవారం ఖమ్మం జిల్లా సింగరేణి కేంద్రమైన ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరా నియోజకవర్గం అంటేనే ఉద్యమాల గడ్డ అని, నాటి తెలంగాణ పోరాటం నుండి నేటి వరకు అడుగడుగునా బిఆర్ఎస్‌కు ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్ర సాధనలో, తెలంగాణ అభివృద్ధిలో బిఆర్ఎస్ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. 25 ఏళ్ల పార్టీ ఆవిర్భావ వేడుకలను వాడవాడలో పండుగలా నిర్వహించాలని కోరారు. బహిరంగ సభకు తరలివెళ్లే పార్టీ శ్రేణులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక నాయకులను కోరారు. కారేపల్లి మండలం నుండి సుమారు 2000మందిని బహిరంగ సభకు తరలించేందుకు మండల బాధ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభకు వెళ్లే ముందు ఏప్రిల్ 27న అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి బయలుదేరాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఒకప్పుడు వెనుకబాటుకు గురైన తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని గుర్తు చేశారు. తిరిగి మళ్లీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేందుకు రాబోయే మూడున్నర ఏళ్లలో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాల గురించి ఈ రజితోత్సవ సభలో పార్టీ అధ్యక్షులు దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 60లక్షల మంది బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వాన్ని కలిగి ఉన్నారని పేర్కొన్నారు. అధికర వ్యామోహం కాకుండా అభివృద్ధి లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అందించిన సుపరిపాలన విషయాన్ని ప్రజలు ఏనాటికి మరిచిపోరన్నారు.

## ఆర్థిక సంవత్సరానికి ప్రణాళికలు



ప్రజాపక్షం/చంద్రుగొండ: 2025,26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సందర్భంగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో సమీక్ష సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్పెషలాఫీసర్ సంజీవరావు అధ్యక్షతన నిర్వహించారు.బ్లాక్ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మండలంలో 22లక్షల 40వేల రూపాయలతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్యంపై దృష్టి సారించి, వాటికి 50శాతం నిధులు కేటాయిస్తున్నట్లుగా తెలిపారు. ఎక్కడైతే ఇళ్లకు మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ లేనిచోట్ల ఈ నిధులను పెద్ద మొత్తంలో వెచ్చించాలని స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు తెలిపారు. రాజీవ్ యువ వికాస్ పథకానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ దానికి సంబంధించిన జిరాక్స్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 14వరకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంపీఓ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారాటి రమేష్‌లు అన్నారు. శుక్రవారం ములకలపల్లి మండల కేంద్రంలో సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వంట గ్యాస్ ధరలను బండకు 50 రూపాయల చొప్పున పెట్రోల్ గ్యాస్ ధరలను పెంచడం వలన పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల ప్రజలకు మోయలేని భారమని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేనియెడల రాబోయే రోజులలో మరిన్ని పోరాటాలు చేస్తారని ప్రభుత్వామన్ని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు సడియం వెంకటేశ్వర్లు, సడియం నాగరాజు, రైతు సంఘం నాయకులు బైరు సాయిబాబా, కంటే మారేశ్వర్‌రావు, కందిమల్ల నాగరాజు, పాలగాని బుజ్జయ్య, జంగిలి రంగా, తదితరులు పాల్గొన్నారు.

## స్థూపావిష్కరణ సభను జయప్రదం చేయాలి



ప్రజాపక్షం/గుండాల : ఐఎఫ్‌టియు జాతీయ ప్రదాన కార్యదర్శి, టైల్స్‌వర్కర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ముక్తర్ పాష స్మారక స్థూపావిష్కరణ సభ ఈనెల 15న బయ్యారం మండలంలో జరుగుతుందని, కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని న్యూడెమోక్రసి మండల కార్యదర్శి అరెంనరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరింప చేశారు. కార్యక్రమంలో వై వెంకన్న, పర్శిక రవి, లాలయ్య, క్రిష్ణ, లాలు, ఎర్రయ్య, సుదాకర్, శేఖర్, తదితరులు ఉన్నారు.

## విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో రైతులకు విద్యుత్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో లో వోల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు ఏర్పాటు చేసిన నూతన 25కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వైరా డిఈ బండి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో ఎటువంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా ఉండేందుకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం మీనవోలు గ్రామంలో విద్యుత్ స్తంభాలు లేక విద్యుత్ అందని వారికి నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయగా వాటిని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు చేతుల మీదుగా ప్రారంభించటం జరిగిందవి ఈ క్యాక్రమంలో మధిర ఎడిఈ ఎం.అనురాధ, ఎఇజి అనూష, విద్యుత్‌శాఖ సిబ్బంది పుల్లయ్య, నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు ధాన్యం తరుగు తీయవద్దు



**-నాణ్యత ప్రమాణాలు లేని ధాన్యాన్ని మిల్లులకు పంపవద్దు**
**-ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ సమీక్ష**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యాసంగి పంట కొనుగోలు సమయంలో మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం తీయవద్దని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ధాన్యం కొనుగోలుపై రైసుమిల్లర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి పంట కొనుగోలు ఖమ్మంజిల్లాలో ప్రారంభమైందని, జిల్లాలో 344 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 212 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వాటిలో 25 కేంద్రాలు కొనుగోలు ప్రారంభించాయని 13 కేంద్రాలలో ధాన్యం వివరాలు ఓపిఎంఎస్‌లో నమోదు చేశారని తెలిపారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో రైసుమిల్లులకు ధాన్యం అలాట్‌మెంట్ చేశామని కొనుగోలు ప్రక్రియకు మిల్లర్లు సహకారం అందించాలన్నారు. కొన్ని రైసుమిల్లులో బస్తాకు నాలుగు కిలోలు తరుగు తీస్తున్నట్లు సమాచారం అందుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు పంపుతున్నామని ఎట్టి పరిస్థితుల్లో తరుగు తీయడానికి వీలు లేదన్నారు. ధాన్యం తూర్పారా పట్టిన తర్వాత మాత్రమే రైసుమిల్లులకు తరలిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో నాణ్యతా ప్రమాణాలను వ్యవసాయ విస్తరణ అధికారి సర్టిఫైడ్ చేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలన్నారు. రైసు మిల్లులకు నాణ్యత లేని ధాన్యం పంపిస్తే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మెమో జారీ చేయడం జరుగుతుందన్నారు. మిల్లులు నాణ్యత ప్రమాణాలు లేని ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దని, అనవసరంగా తరుగు పేరిట కోతలు విధించవద్దని ఆయన తెలిపారు. మరో 10 రోజుల్లో ధాన్యం భద్రపరిచే గోదాములు ఖాళీ అవుతాయని ఎటువంటి ఇబ్బందులు రావని కొనుగోలు కేంద్రాల వద్ద ఏమైనా లోపాలు ఉంటే తెలపాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా సహకార అధికారి గంగాధర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, మిల్లర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య ప్రాముఖ్యతను చాటిన మహనీయుడు పూలే




**-కుల వివక్ష నిర్మూలనతో నవ సమాజ నిర్మాణం సాధ్యం**
**-మహత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చదువుతోనే జీవితంలో మార్పు సాధ్యమని విద్య యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయుడు మహత్మ జ్యోతిబా పూలే అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వర్ణ, కుల వ్యవస్థ కారణంగా దళితులు బడుగు, బలహీన వర్గాలు తీవ్ర వివక్షకు గురయ్యేవన్నారు. 1827లో మహిళలను సమానంగా చూడటం అనే ఆలోచన కూడా కష్టమని అటువంటి పరిస్థితుల్లో మహిళల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మహత్మ గాంధీ, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ ఆలోచనలకు కూడా పూలే స్ఫూర్తిగా నిలిచారన్నారు. సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలన్నారు. విద్య అందరికీ అందాలని పూలే దంపతులు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీశ్రీ సర్కిల్‌లోని మహత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బిసి అభివృద్ధి అధికారి జి. జ్యోతి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, బిసి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గాడ్సే వారసులను అడ్డుకుంటాం

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాంధీజీపై గాడ్సే తూటా పేల్చి హత్య చేశాడని, గాడ్సే ఆలోచన ధోరణిని అవలంభిస్తున్న ఆయన వారసులను అడ్డుకుంటామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని 35, 47 డివిజన్లలో జైబాపూ జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్న బిజెపి పాలకుల అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్న బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలను కాపాడాలని కాంగ్రెస్‌శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నేతలు మిక్కిలినేని నరేంద్ర, కొప్పెర ఉపేందర్, కన్నం ప్రసన్నకృష్ణ, ముస్తఫా రఫీదాబేగం, బానాల లక్ష్మణ్, నరాల నరేష్, బోజడ్ల సత్యనారాయణ, సింగం అంజయ్య, ఎకె రావు, వెంకన్న, బాలిని రమేష్, జాకీర్, సముద్రాల శ్రీనివాస్, శ్రీను, ఎస్‌కె రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఎం నిరసన




**ప్రజాపక్షం/ మధిర :** పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్‌పై రూ.50 పెంచి ప్రజలపై మరింత భారాన్ని కేంద్ర ప్రభుత్వం మోపిందన్నారు. ఒకవైపు ఉపాధి అవకాశాలు దెబ్బతిని కొనుగోలు శక్తి పడిపోయి ప్రజలు అవస్థలు పడుతుంటే ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం ప్రజలపై భారాల మోపటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పట్టణ మండల కార్యదర్శులు పడకంటి మురళీ, మందా సైదులు, నాయకులు పాపినేని రామనర్సయ్య, తేలప్రోలు రాధాకృష్ణ, ఊట్ల శంకర్‌రావు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 25లోగా అగ్నివీర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అగ్నివీర్ ఎంపిక పరీక్ష కోసం జిల్లాలోని నిరుద్యోగ అవివాహిత యువకులు ఏప్రిల్ 25లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఆర్మీలో వివిధ కేటగిరిల వారీగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ (క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్ ), అగ్నివీర్ ట్రేడ్‌మెన్‌కు పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా ఏమైనా రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చునని అదేవిధంగా ఐటిఐ, డిప్లొమా, ఎన్‌సిసి అర్హత పొందిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఉంటాయన్నారు. 13 భాషాలలో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆన్‌లైన్ విధానంలో చేపట్టడం జరుగుతుందని అభ్యర్థులు www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ పేర్లను ఏప్రిల్ 25లోగా నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఆన్‌లైన్ తదుపరి జూన్ 2025లో సంబంధిత వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులు పొందవచ్చునని ఆమె తెలిపారు. అప్‌డేట్స్ కోసం వెబ్‌సైట్, అభ్యర్థులు వారి ఈమెయిల్ ఐడిని పరిశీలించాలని, మెరిట్ ప్రకారం ఎంపిక ఉంటుందని ఆమె తెలిపారు. ఇతర వివరాలకు సికింద్రాబాద్‌లోని రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఫోన్ నెం. 04027740205ను సంప్రదించాలని కోరారు.

# సామాజిక సంఘ సంస్కర్త పూలే



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** అణగారిన కులాల ప్రజల హక్కులకై పోరాడిన సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సంస్కరణల ఉద్యమాల్లో ఒక ముఖ్యమైన వ్యక్తిగా అన్ని మతాలు, కులాలు ఒక సంఘంలో భాగం కావచ్చునని ఇది అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసేదన్నారు. అనేక గొప్ప మార్పుల దిశగా పూలే పరిగణించబడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటాబాబా, టిపిసిసి సభ్యులు, జిల్లా ఓబిసి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, జిల్లా ఆర్టిఏ మెంబర్ వెంకన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఆలస్యమవుతున్న ఆర్వోబి నిర్మాణం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రధాన రైల్వే ట్రాక్ మార్గంలో ప్రజల సౌకర్యర్థం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్వోబి నిర్మాణ పనులు జాప్యం కావటానికి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని బిజెపి నాయకులు ఆరోపించారు. శుక్రవారం పాత రైల్వే గేటు దగ్గర మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా గోడ నిర్మిస్తున్న క్రమంలో సంబంధిత రైల్వే అధికారులు, ఆర్అండ్‌బి అధికారులు, మున్సిపాల్టీ కమీషనర్‌ను కలిసి వినతిపత్రాలను అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికం ఉన్న కొంతమంది వ్యక్తుల స్వార్థం కారణంగా ఆర్వోబి నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయని విమర్శించారు. మధిర ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి మధిర ప్రజల చిరకాల కోర్కె అయిన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, పట్టణ, మండల అధ్యక్షులు శివరాజ్ సుమత్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, కుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణకర్, పాపట్ల రమేష్, గడ్డం శ్రీహరి, పగడాల నాగేంద్ర పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ బహిరంగ సభకు తరలి రండి



**ప్రజాపక్షం/వైరా:** వరంగల్ జిల్లా ఎల్కతుర్తి గ్రామంలో ఈ నెల27న జరగనున్న బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని బిఆర్ఎస్ వైరా పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ ఎంపిపి, దిశా కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జున్‌రావు, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు అన్నారు. పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన శుక్రవారం స్థానిక బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో వార్డుకు సుమారు పది మంది చొప్పున మహాసభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ విజయవంతం చేసేందుకు ప్రతిఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని ప్రజలు బిఆర్ఎస్ వపు చూస్తున్నారని స్థానిక సంస్థల్లో తమ సత్తా చాటేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపాల్ మాజీ కౌన్సిలర్ తడికమళ్ళ నాగేశ్వరరావు, మాదినేని ప్రసాద్, దొంతబోయిన గోపి, దొంతబోయిన వెంకటేశ్వర్లు, ఏదునూరి శ్రీఉ, ఆదూరి ప్రేమ్, బానోతు సక్కుబాయి, మడుపల్లి కృష్ణ, కారుకొండ బోస్, నల్లగొండ నాని, మాచర్ల శంకర్, దొంతబోయిన చింతయ్య, బానోతు వీరన్న, తన్నీరు కిసోర్, ఓర్సు రవి, బత్తుల రాజుభాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయం మార్గం చూపే వరకు గోడ నిర్మాణం ఆపాలి

**- సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన, వినతిపత్రం అందజేత**




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రధాన రైల్వే ట్రాక్ వద్ద ప్రత్యామ్నాయం మార్గం చూపే వరకు గోడ నిర్మాణం ఆపాలని సిపిఐ, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రైల్వే గోడ నిర్మాణ పనులను అడ్డుకుని రైల్వే అధికారులకు వినపత్రాలను అందచేశారు. అనంతరం జరిగిన ఆందోళన కార్యక్రమానుద్దేశించి సిపిఐ, సిపిఎం జిల్లా నాయకులు బెజవాడ రవిబాబు, శీలం నర్సింహారావు, పాపినేని రామనర్సయ్య, మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ మధిర పట్టణాన్ని రెండుగా విభజిస్తూ నడి బొడ్డున ఉన్న రైల్వే ట్రాక్ నుండి గత 30 సంవత్సరాలుగా ప్రజలు రాక పోకలు కొనసాగిస్తున్నారన్నారు. మధిర పట్టణానికి పరిసర గ్రామాల నుండి వచ్చే వేలాదిమంది ప్రజలు వివిధ అవసరాల కోసం ముఖ్యంగా పాదచారులు పక్కనే ఉన్న ఆర్వోబిని ఎక్కలేక నిత్యం ఈ రైల్వే ట్రాక్ గుండే ప్రయాణిస్తుంటారని, అలాంటి మార్గాన్ని రైల్వే అధికారులు గోడ కట్టి శాశ్వతంగా మూసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రైల్వే మూడవ లైన్ పనుల్లో భాగంగా అండర్ రైల్వే బ్రిడ్జి గత మూడు నెలలుకు పైగా మూసి వేయటంతో పట్టణంలో వ్యాపార వర్గాలకు, చిరు వ్యాపారులకు వ్యాపారం లేక కుదేలయ్యారని, కొంతమంది వ్యాపారులు షాపులను ఖాళీ చేసే పరిస్థితి వచ్చిందన్నారు. మధిర పట్టణ ప్రజల ప్రధాన సమస్యగా ఉన్న దీనిపై పాలకులు స్పందించకపోవటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అండర్ పాస్ నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పడకంటి మురళి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, స్థానిక వ్యాపారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్యారెట్ లేన్ డైమండ్ షోరూం ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన టాటా కంపెనీకి చెందిన క్యారెట్ లేన్ డైమండ్ షోరూంను ప్రారంభించారు. ఖమ్మంవైరా రోడ్డు జెడ్పి సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యారెట్ లేన్ డైమండ్ షోరూంను ప్రముఖ వైద్యురాలు బోడేపూడి శైలజ ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ క్యారెట్ లేన్ డైమండ్ జ్యూవరి తక్కువ బడ్జెట్‌తో మగువలకు ఎంతో హుందాతనాన్ని ఇస్తుందన్నారు. నేను యుఎస్ వెళ్లినప్పుడుచాలా మంది ఈ క్యారెట్ లేన్ డైమండ్‌ను వాడుతున్నారని ఆమె తెలిపారు. ఇటువంటి సంస్థను మన ఖమ్మంకు నిహారిక జ్యూవల్స్ వారు అందుబాటులోకి తీసుకు రావడం ఎంతో సంతోషకరమన్నారు. మహిళలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిసి సంస్థల ఎండి వివి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ క్యారెట్ లేన్ ద్వారా అమ్మే ప్రతి ఉత్పత్తి అత్యున్నత నాణ్యత కలదన్నారు. వినియోగదారుల పాత బంగారం కూడా మార్పిడి చేసుకుని క్యారెట్ లేన్ వారి సరికొత్త ఆభరణాలను పొందవచ్చున్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా వినియోగదారులు కొనుగోలు చేయవచ్చున్నారు. ఇది టాటా ప్రోడక్ట్స్ అని నాణ్యతలో రాజీ లేకుండా డైమండ్స్ ఇవ్వడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ క్యారెట్ లేన్‌లో డైమండ్ జ్యూవల్స్ రూ.7వేల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. స్టూడెంట్స్, వర్కింగ్ మహిళల కొరకు, కపుల్ వెడ్డింగ్ రింగ్స్ కూడా అతి తక్కువ ధరలకు లభ్యమవుతాయని తెలిపారు. ఖమ్మం క్యారెట్ లేన్‌లో ప్రారంభ సందర్బంగా ఆఫర్‌ను అందిస్తుందని తెలిపారు. రూ. 30వేలు కొనుగోలు చేసిన వినియోగదారునికి 0.05 మిల్లీ గ్రాముల బంగారం బహుమతి కలదన్నారు. డే వైజ్, గిఫ్ట్ కొరకు ప్రత్యేక డైమండ్స్ కలవన్నారు.కస్టమర్లు ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకుని మా షోరూంకు వచ్చి తీసుకునే వెసులుబాటు కలదన్నారు. ఈ కార్యక్రమంలో వివిసి చైర్మన్ ద్రౌపతి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం కోసం రైతులు పోరాటం చేయాలి

**ఏఐకెఎస్ జాతీయ కమిటీ సభ్యులు బొంతు రాంబాబు**




**ప్రజాపక్షం/వైరా:** అసాధారణ పోరాట చరిత్ర అఖిల భారత కిసాన్ సభ(ఏఐకెఎస్) ది అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరాలో అఖిల భారత కిసాన్ సభ 89వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఐకెఎస్ జెండా సీనియర్ రైతు నాయకులు కొత్తా సీతారామయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ జాతీయోద్యమంలో అంతర్భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతాంగ ఉద్యమాలను సంఘటిత చేసేందుకు 1936 ఏప్రిల్11 ఉత్తరప్రదేశ్ లక్నోలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకెఎస్) ఆవిర్భవించింది అన్నారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు వెట్టి చాకిరి నిర్మూలన, వడ్డీ వ్యాపారుల పీడనకి వ్యతిరేకంగా దేశవ్యాప్త రైతు పోరుబాటకు అఖిల భారత కిసాన్ సభ ఏఐకెఎస్ పునాది వేసిందన్నారు. సాగుదారుల హక్కుల రక్షణకై సమరశీల ఉద్యమాలు కొనసాగుతున్నాయని, స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు, మద్దతు ధరలకు చట్టభద్రత, జాతీయ రుణవిమోచన కోసం వ్యవసాయ రంగం కార్పొరేటీకరణకి వ్యతిరేకంగా ఐక్య రైతు ఉద్యమానికి అఖిల భారత కిసాన్ పోరవ చేస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న స్వీయ రక్షణ ప్రతికార సుంకాలు వాణిజ్య యుద్ధంలో భారత రైతాంగం నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు మాజీ ఎంపిపి బొంతు సమత, తోట కృష్ణవేణి, హరి వెంకటేశ్వరరావు, సంక్రాంతి పురుషోత్తం, మాడపాటి మల్లికార్జున్, గుమ్మా నర్సింహారావు, షేక్ ఖాజా, ఒర్సు సీతారాములు, మాడపాటి రాజేష్, మడుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మా జోతిరావు పూలే 199వ జయంతి

**పూలమాల వేసి నివాళులర్పించిన ఎంఎల్ఏ డా.మట్టా**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఘనంగా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి ముఖ్య అతిదిగా హాజరై జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పూలే స్ఫూర్తితో సామాజిక, కుల అణచివేతలకు వ్యతిరేకంగా, ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్లు పద్మ జ్యోతి, నాగలక్ష్మి, సీనియర్ నాయకులు చల్ల గుళ్ళ నరసింహారావు, కమల్ పాషా, పింగళి సామ్యూల్, మానుకోట ప్రసాద్ పాల్గొన్నారు.



# ఎంపి కార్యాలయంలో చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఖమ్మం ఎంపి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా 28 మంది లబ్ధిదారులకు రూ. 10.70 లక్షల చెక్కులను కార్యాలయ ఇంచార్జి కొప్పుల చంద్రశేఖర్ బాధితులకు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆర్థిక వెసులుబాటు కోసం ఎంపి రఘురాం రెడ్డి సిఫారసు మేరకు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు షేక్ ఇమామ్‌బాయ్, నాయకులు గోనెల భుజంగరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, ఇమ్మడి తిరుపతిరావు, పాషానాయక్, చారి, ఏసు, మజీద్, ఎన్. వెంకటేశ్వర్లు, రామ్మూర్తి నాయక్, మల్లెల నాగేశ్వరరావు, తొగర శ్రీను, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి

**ప్రజాపక్షం/భద్రాచలం :** మద్యం మత్తులో ఇద్దరి వ్యక్తులపై దాడిచేసి గాయపరిచిన సంఘటన చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం, పండా కృష్ణమూర్తి అనే వ్యక్తి ఉన్మాదిగా మారి బైపై వచ్చి ఆటోకు అడ్డుగా ఉండే వెళ్లిపోయాడు. కాగా దీనిపై ఆటోల ఉన్న వినోద్ కుమార్, తాటి భూపతిరావులు ఎదుకు అలా చేసావని ప్రశ్నించారు. దీంతో కోపోద్రోక్తుడైన అతను ఒక్కసారిగా కత్తితీసుకుని ఇద్దరిపై విచక్షణారహితంకా దాడి చేశాడు. గాయపడిన వారు కేకలు వస్తుండంగా గమనించిన స్థానికులు వెంటనే వారిని చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో హుటాహుటిన భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారికి అతిక్లిష్టమైన పరిస్థితుల్లో డా. రామకృష్ణ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఐసియా తరలించారు. దీనిపై చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నింధితుడు కృష్ణమూర్తి పరారీలో ఉన్నాడు.

# కత్తితో దాడికి పాల్పడ్డ యువకుడు

**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామంలో రైతు వేదిక సమీపంలోని బూర బతకయ్య గౌడ వృత్తి కొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 7:39 సమయంలో బతకయ్య ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తూ ఉండగా వారి ఇంటికి గొల్ల సామాజిక వర్గానికి చెందిన అరవ బాబు, అరవ చిన్ని, అరవ రమణ, అరవ శ్రీలత హఠాత్తుగా బతకయ్య గృహంలోకి వచ్చి భోజనం చేస్తున్న ప్లేట్లను తొక్కుకుంటూ లోపలికి వచ్చి బతకయ్య వాళ్ళ బంధువైన గుండు నాగలక్ష్మి (43) పై విచక్షణ రహితం కోల్పోయి కత్తితో పొత్తి కడుపులో, ఛాతి పైన పొడిచాడు. రక్తస్రావం అవ్వగా ప్రాణాపాయ స్థితిలో స్పృహకోల్పోయి కింద పడిపోయింది. నిందితుడు పొడిచి ఇంట్లో నుండి పారిపోయాడు. వెంటనే అంబులెన్స్ కి ఫోన్ చేసి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. నిందితుడు పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. గురువారం రాత్రి బూర బతకయ్య ఆటో లో తన కుమార్తె మరియు తన స్నేహితుడు, స్నేహితుడి పిల్లలతో కలిసి ఇంటికి తిరిగి వెళ్తుండగా గొల్ల సామాజిక వర్గానికి చెందిన అరవ చిన్ని, గోల్ల వెంకటనారాయణ, కట్టబోయిన సతీష్, కట్టబోయిన అరవింద, కల్లకుల సత్యనారాయణ, రమణ, కల్లకుల లక్ష్మం కాంత హత్య ప్రయత్నానికి పాల్పడ్డారు. బతకయ్య తప్పించుకొని పారిపోయాడు అవి సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని ఆయన తెలిపారు. ఈ విషయం ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# మొక్కజొన్నల పరిశీలన

**ప్రజాపక్షం/వైరా:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు సారథ్యంలో వైరా పట్టణ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ అధ్యక్షతన రైతు సమస్యలపై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా బృందం పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జాతీయ నాయకులు జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి మండలంలో పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైరాలో మార్కెట్‌యార్డ్ నందు సందర్శించి రైతు సమస్యలు తెలుసుకొని వెంటనే ఒడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని దెబ్బతిన్న మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. వైరా మార్కెట్‌యార్డ్ నందు ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించి మార్కెట్‌యార్డ్‌ను సొంత యార్డ్‌గా ఉపయోగించుకుంటూ అధికారులను బెదిరిస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. తదుపరి లాలాపురంలోని మొక్కజొన్న రైతులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా స్టేట్ సెక్రటరీ చిలుకూరి రమేష్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చావా కిరణ్, మందడపు సుబ్బారావు, ఆర్‌విఎస్ యాదవ్, టి.రవీందర్, రుద్రగాని మాధవ్, కంపసాటి అంజయ్య, కోసూరి గోపాలకృష్ణ, దోసపాటి కళ్యాణ్, వల్లెపు అనిల్, ఇజ్జగాని మురళి, తాతా ఆదినారాయణ పాల్గొన్నారు.



# కుసుమ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించిన ముళ్ళపాటి

**ప్రజాపక్షం/వైరా:** వైరాతో పాత బస్టాండ్ వద్ద ఉన్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలో కుసుమ ఎంటర్‌ప్రైజెస్‌ను శుక్రవారం వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని కొనియాడారు. కుసుమ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రైటర్ తేజావత్ ఆదినారాయణను అభినందించారు. వీరితో పాటు ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగి తేజావత్ నాగేశ్వరరావు, బికియా, తేజావత్ రాజా, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# తెలంగాణ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



## వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/మణుగూరు:** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారిని స్మరించుకొని సమాజానికి చేసిన సేవని చదువు పట్ల పేదవాళ్లకి ముఖ్యంగా ఆడబిడ్డలకి చదువు ఎంత ప్రాముఖ్యత ఉందో, మన నుంచి దూరమైన ఆయన చేసిన సేవలను గ్రహించి ఈనాడు మా ప్రభుత్వం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడుతుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పినపాక నియోజకవర్గం లో ఆయన సుడిగాలి పర్యటన చేస్తూ మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, శాసనసభ్యులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా బూర్గంపాడు మండలం లోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి జెడ్పీ రోడ్డు వరకు గౌతమ్ పూర్ నుండి సోంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ. 90 లక్షల వ్యయంతో సిఆర్ఆర్ ప్లాన్ నిధులనుండి రోడ్డు నిర్మాణానికి పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం తాళ్లగొమ్మూరు దగ్గరలోని ముత్యాలమ్మ తల్లి దేవస్థానమును ముత్యాలమ్మ తల్లి దేవస్థానమును సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వాపురం మండలం సీతారాంపురం ఆర్ అండ్ బి రోడ్డు నుండి బిజీ కొత్తూరు గ్రామం వరకు సుమారు 63 లక్షల అంచనా వ్యయంతో ఎస్ టి ఎస్ డి ఎఫ్ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, మణుగూరు మండలంలోని సమితి సింగారం గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదులను నాలుగు కోట్ల 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం పనులకు, కురసం వారి గూడెం ఆర్ అండ్ బి రోడ్డు నుండి జగ్గారం గ్రామం వరకు సుమారు కోటి రూ. 92 లక్షల అంచనా వ్యయంతో సి ఆర్ ఆర్ ప్లాన్ నిధులతో బీటీ రోడ్డు పనుల నిర్మాణం కొరకు అలాగే ఒక కోటి 92 లక్షల వ్యయంతో గొల్ల కొత్తూరు కాలనీ హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులను, ఒక కోటి 50 లక్షల వ్యయంతో రామానుజ వరం నుండి పగిడేరు రోడ్డు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పనులకు, పుప్పాక బ్రిడ్జి నుండి పోతిరెడ్డిపల్లి వరకు 96 లక్షల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణం పనులకు, పోతిరెడ్డి పల్లె నుండి క్రింది గుంపు వరకు 80 లక్షల వ్యయంతో బీచ్ రోడ్డు నిర్మాణం పనులకు, మల్లారం నుండి వెంకటేశ్వరపురం వరకు కోటి 44 లక్షల వ్యయంతో బీటి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎక్స్ వి ఎఫ్ సి గ్రాంట్ నిధులతో ఒక కోటి 56 లక్షల వ్యయంతో పినపాకలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాలలోని నిరుపేదలైన కుటుంబాలకు విద్యా వైద్యం గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పన కొరకే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అలాగే యువతి యువకులకు, మహిళలకు, సన్న కారు రైతుల అభివృద్ధి కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, ముఖ్యంగా విద్యా పరంగా ఎంతో శ్రద్ధ చూపి ప్రతి నియోజకవర్గంలో 3500 మంది పిల్లలు చదువుకునే విధంగా 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం చేపడుతున్నారని, రాష్ట్రం మొత్తానికి 11600 కోట్ల రూపాయలు మంజూరు చేశారని అన్నారు. పినపాక మండలంలోనీ చుట్టుపక్కల ఉన్న నిరుపేదలైన కుటుంబాలకు డాక్టర్లు కానీ దయచేసి ఇబ్బంది కానీ రోగుల పట్ల మర్యాదపూర్వకంగా ఉండి వారికి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి తగినన్ని మందులు అందజేయాలని, ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలలో పనిచేసే వైద్య సిబ్బంది వారి విధులను సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ మరియు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే ఆశయాల కోసం పోరాడదాం




## -ఘనంగా జ్యోతిరావు పూలే 198వ జయంతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** భారతదేశ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల కోసం పోరాడదామని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా శుక్రవారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పూలే చిత్ర పటానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ శూద్రులకు చదువులకు దూరం చేసిన మనువాదాన్ని తోసిపుచ్చి చదువు ద్వారానే మనిషి విజ్ఞాన వంతుడవుతాడని, మనువాదానికి వ్యతిరేకంగా మహత్మ జ్యోతిరావు పూలే పోరాడారన్నారు. మహిళలను తక్కువ చేసి వీరికి చదువులు అవసరం లేదని వంటింటికే పరిమితం చేసిన మనువాదులకు వ్యతిరేకంగా 1948లో మహారాష్ట్ర పూణే నగరంలో స్త్రీలకు పాఠశాలను ఏర్పాటు చేసిన మహానీయుడు పూలే అన్నారు. సమాజసేవ కోసం సత్య సామాజిక సంస్థను ఏర్పాటు చేసిన సంఘ సంస్కర్త అన్నారు. పూలే ఆశయ సాధన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, నాయకులు గాదె లక్ష్మి నారాయణ, నూనె శశిధర్, తాటి నిర్మల, జ్వాలా నర్సింహారావు, మేకల రవి కుమార్, పోటు పూర్ణచందర్‌రావు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిబాపూలే జయంతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని కండ్రిక గ్రామంలో కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బాపూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు వి.అనూష ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమ్లానాయక్, రంగా కొండ, రవినాయక్, సొసైటీ సభ్యులు బి.రమేష్, జి.పుల్లారెడ్డి, కనకవల్లి రమ్య తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పేదల కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతుంది : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పేదల కుటుంబాల్లో సంతోషాన్ని నింపుతుందన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. శుక్రవారం పట్టణంలోని గుడిపాడు లోని ఆదివాసీ గంటా విష్ణు కుటుంబంతో కలిసి ఎం.ఎల్.ఏ రాగమయి, దయానంద్ దంపతులు సన్న బియ్యంతో వండిన ఆహారంతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం గురించి, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బట్టి, తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎం.ఎల్.ఏ డా.మట్టా దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మాజీ కౌన్సిలర్స్ పద్మ జ్యోతి, కంటే నాగలక్ష్మి , నాగుల్ మీరా, దూదిపాల రాంబాబు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, చల్లగుళ్ల కృష్ణా రావు, కమల్ పాషా, మానుకోట ప్రసాద్,కొల్లి నరసింహ రావు, పూచి గోవర్ధన్, పూచి యశోద, వీరాస్వామి, జొన్నలగడ్డ కృష్ణ వంశీ, సత్తుపల్లి పట్టణం, ఎన్.ఎస్.యూ.ఐ యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా నేడు సిపిఐ ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపులో భాగంగా వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 12న అన్ని మండల, జిల్లా కేంద్రంలో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. బిజెపి లౌకిక వాదానికి తూట్లు పొడుస్తూ మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని సురేష్ ఆరోపించారు. మెజార్టీ, మైనార్టీ ప్రాతిపదికన ఎన్నికల్లో లబ్ది పొందెందుకు మాత్రమే ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో బిజెపికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాట క్రమంలో ఈ ఆందోళనను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకత్వం అన్ని మండలాల్లో ఆందోళనలు జరిగేవిధంగా చూడాలని ఆయన కోరారు.

## గ్రూప్ వన్ ర్యాంకర్ లక్ష్మీసాహితిని అభినందించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/వైరా:** వైరాకి చెందిన సంగెపు వెంకటేశ్వరరావు కూతురు సంగెపు లక్ష్మీ సాహితి ఇటీవల ప్రకటించిన గ్రూప్ వన్‌లో ర్యాంకు సాధించింది. శుక్రవారం వైరా వచ్చిన తెలంగాణ రాష్ట్ర తెలంగాణ రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్మీ సాహితిని అభినందించి శాలువా కప్పారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని మంత్రి పొంగులేటి అన్నారు. లక్ష్మీ సాహితిని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని అనుకుంది సాధించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, గుమ్మడిదల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విఎం బంజర్ బస్టాండ్‌లో గంజాయి కలకలం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని వియం. బంజర్ బస్టాండ్ లో గంజాయి కలకలం రేగింది. వియం బంజర్ బస్టాండ్ లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు వియం బంజర పోలీసులు. పోలీస్‌లు తెలిపిన వివరాలు ప్రకారం... ఒరిస్సా రాష్ట్రంలోని కోరమనూరు ప్రాంతం నుండి భద్రాచలం మీదుగా భద్రాచలం నుండి విజయవాడకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం అందింది. వియం. బంజర్ ఎస్సై కె. వెంకటేష్ తన సిబ్బందితో కలిసి పక్కా ప్రణాళికతో వ్యవహరించి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న వ్యక్తి పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన బోయిన వెంకటరమణగా గుర్తించారు. అతని వద్ద నుండి సుమారు 75 వేలు విలువ చేసే 1.110 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు పంచనామా చేసి వ్యక్తిని, గంజాయిని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెంది ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం వైపు నుండి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంతో వస్తూ రోడ్డు దాటుతున్న పోడియం దినేష్ (39) అతని కుమారుడు బీమా లను ఢీ కొట్టడంతో దినేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కొడుకు బీమాకు తీవ్ర గాయాలయ్యాయి. వారిది చత్తీస్‌ఘడ్ లోని సుక్మ జిల్లా. గత ఎనిమిది సంవత్సరాల నుండి ములకలపల్లి మండలంలోని ధర్మ నగర్లో ఉంటూ కూలి పని చేసుకుంటూ బతుకుతున్నారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కొడుకు ఉన్నారు. మృతుడు రాఘవపురంలోని మామిడి తోటలో తన తమ్ముడైన గంగయ్య వద్ద తన కొడుకు బీమాను తీసుకొని వెళ్లడానికి వచ్చి రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదం వల్ల మండల కేంద్రంలో ప్రధాన సెంటర్లో వ్యక్తి చనిపోవడంతో అంతా భయభ్రాంతులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీస్‌లు మృతుదేహాన్ని కొత్తగూడెం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుజాతనగర్ ఎస్ఐ మాలోత్ రమాదేవి ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్త్రీ నిధి సంస్థపై దుష్ప్రచారాలు మానుకోవాలి

**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** స్త్రీ నిధి సంస్థపై కొందరు వ్యక్తులు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని స్త్రీ నిధి ఉద్యోగుల సమాఖ్యా రాష్ట్ర అధ్యక్షుడు మూడు సంపత్ కుమార్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులపై సంస్థకి సంబంధం లేని వ్యక్తులు వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని తెలిపారు. సంస్థలో అక్రమాలు జరిగాయంటూ పుకార్లు పుట్టిస్తూ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది సంస్థలో లేని వ్యక్తులు ఉద్యోగ సంఘంలో రాష్ట్ర నాయకులు అంటూ చెలామణి అవుతున్నారని తెలిపారు. కానీ స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లో ఉద్యోగ సంఘాలు లేవని అన్నారు. ఇప్పటికైనా స్త్రీ నిధి సంస్థపై అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, పెనుగురి మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.